19-2-1993 శుక్రవారం 10 పేజీలు సంపుటి : 64 సంచిక 8; విడిప్రతి : రు. 2.00 లు

Regd. No. H.N.L. 18

# జమీన్ రైతు

స్థాపకుడు : నెల్లూరు వెంకటరామానాయుడు

జెంట్స్, రెడీమేడ్ గార్మెంట్స్
లేటెస్ట్ సూటింగ్స్, షర్టింగులకు
విమల్ జంక్షన్
కాపువీధి - నెల్లూరు

# ముఖ్యమంత్రికి మనశ్శాంతి కరువు?

ఏ దుర్ముహూర్తాన పదవీ ప్రమాణం చేశారో కాని, ముఖ్యమంత్రి విజయభాస్కర రెడ్డి ఒక్క క్షణం మనశ్శాంతిగా గడపలేక పోతున్నారు. సారాయి ఉద్యమ వికాకు, పాణ్యం ఉపఎన్నిక న్యూసెన్సు, బాలరాజు కిడ్నాప్ టెన్షన్లతోనే సతమతమౌతుంటే, బాపిరాజు అనవసరంగా ఎక్సైజ్ వివాదం తెచ్చి పెట్టారు. 21 డిస్టిలరీలకు లైసెన్సు లిస్టు జి.ఓ. విడుదల చేసిన తర్వాత కాని ముఖ్యమంత్రికి విషయం తెలియలేదు. అప్పుడు పిల్చి ఇంత పెద్ద నిర్ణయం ఎందుకు తీసుకున్నావయ్యా అని అడిగితే - దానిదేముంది సార్, పెండింగ్ ఫైళ్లు డిస్పోజ్ చేస్తూ సంతకం పెట్టేశాను అని తేలికగా సమాధానమిచ్చాడట బాపిరాజు. విజయ భాస్కర రెడ్డి తన మంత్రులకు వారి వారి శాఖల విషయంలో ఎంతటి స్వేచ్ఛ కల్పించారో తెలుసు కోవడానికి ఇదొక నిదర్శనం. డిస్టిలరీల వంటి లాభదాయక నిర్ణయాలూ మంత్రుల లెవల్లోనే జరిగి పోవడం మనకు తెలిసినంత వరకు అరుదైన విషయం.

ఇందులో ఉత్తర్వు కాగితాలకు, కరెన్సీ నోట్లు బదలాయింపు జరిగిన మాట నిజమే కాని, ఎన్టీఆర్ ఆగం చేస్తున్నట్లు కోట్ల లావాదేవీ మాత్రం గాలి కబురే! ప్రభుత్వ ఉత్తర్వులతో కోట్లు పిండుకో గల్గిన తెలివి అందరు కాంగ్రెస్ నాయకులకూ లేదు. చిల్లర సర్దుబాటుతోనే ఇది జరిగి పోయిందని పరిశీలకుల పరిశోధనా సారాంశం. అందులోనూ ఏకీకృత అవినీతిగా వున్నట్లు లేదు. మంత్రులు చాలా మంది తమ తమ లెవల్లో సర్దుబాట్లు చేసుకొని చీటీలు ఇచ్చి, లైసెన్సులు జారీ చేయించారని వినికిడి. పాపం బాపిరాజుకు వ్రతం చెడినా ఫలితం

## బాపిరాజు బర్తరఫ్ తప్పదా?

దక్కలేదు. డిస్టిలరీలు పోతే పోయాయి.అసలు మంత్రిత్వానికే ప్రమాదం వచ్చి పడింది! అసెంబ్లీలో ప్రతి పక్షాల దాడికి బోనులో చిక్కిన ఎలుకలాగా ఇరుక్కు పోయాడు. ముఖ్యమంత్రిని కాపాడను "పాపం, పెద్దాయన్ను ఏమీ అనబాకండి, ఆ పాపమంతా నేను భరిస్తాను" అని ప్రకటన చేశారు; ఆ పెద్దాయన మాత్రం ఆ మాత్రం సానుభూతి లేకుండా ఏకంగా న్యాయ విచారణకు ఆదేశించాడు. ఇప్పుడు మంత్రి పదవికి రాజీనామా ఇస్తే అధికారులు తనకు తెలియకుండా ఏవంటే ఆ ఫైళ్లిచ్చి ఇబ్బంది పెట్టిస్తారని భయం; రాజీనామా చేయకుంటే ప్రతిపక్షాలు పూరకుండేటట్లు లేవు. విజయభాస్కర రెడ్డికి ఇది న్యూసెన్స్‌గానే వుంది. బాపిరాజు తనంతట తానుగా రాజీనామా ఇవ్వకుంటే బర్తరఫ్ చేయాలని ఆయన ఆలోచిస్తున్నట్లు చెప్తున్నారు.

ఈ సమస్య ఎక్కువ కాలం సానడం ఆయనకూ క్షేమం కాదు. అసెంబ్లీలో దీనిపై చర్చ జరిగే కొద్దీ తన పేరూ ప్రస్తావనకు వచ్చేట్లుంది. తన కుమారుడి పేరు వీధికి లాగుతున్నారు. ప్రకాశ రెడ్డి మంత్రులకు ఫోన్లు చేసి చిన్న చిన్న పనులు చెప్పడం జరుగుతున్నా, పెద్ద పెద్ద కుంభకోణాలు నడిపేంత అనుభవం, సమర్థత ముఖ్యమంత్రి కుమారుడిలో లేవు. చెన్నారెడ్డి, పివిల కుమారుల వలె ప్రాభవంలోకి వచ్చే నైపుణ్యమూ లేదు. బాపిరాజు సంగతి అటో, ఇటో తేల్చక పోతే ప్రకాశ రెడ్డిని బజారు కీడ్చేట్లున్నారు ప్రతిపక్ష నాయకులు. అందుకోసమైనా బాపిరాజు బర్తరఫ్ తప్పదని వినికిడి.

* * *

రెండు వారాల క్రితం విశాఖ ఏజెన్సీలో నక్సలైట్లకు బందీగా చిక్కిన ఎమ్మెల్యే బాలరాజు ఇంకా బందీగానే వున్నారు. ప్రభుత్వం కర్ర విరగకుండా, పాము చావకుండా ఈ సమస్యను నెట్టుక వస్తూంది! నక్సలైట్ల కోరిక మన్నించి క్రాంతి రణదేవ్‌ను జైలు నుంచి విడుదల చేస్తే పోలీసుల్లో అసంతృప్తి తలెత్తేట్లుంది. అందువల్ల అతడికి కోర్టుల్లో బెయిళ్లు మాత్రం మంజూరు చేయించారు. అవి అమలు జరగాలంటే ఎవరో ఒకరు జామీను వుండాలి. వదలిన మరుక్షణం అడవుల్లోకి మాయమై పోయే నక్సలైట్‌కు ఎవరు జామీను వుంటారు? బాలరాజును నక్సలైట్ల దయా దాక్షిణ్యాలపై వదలి వేస్తే - గిరిజన ఎమ్మెల్యే ప్రాణానికి విలువ ఇవ్వలేదనే నిందపైన పడుతుంది; అసమ్మతి రాజకీయం మొదలౌతుంది; అందువల్ల క్రాంతి రణదేవ్ విడుదలకు తన అభ్యంతరం లేదని జనాన్ని నమ్మించ వలసి వస్తున్నది. ఈ సమస్య ఎట్లా, ఎప్పుడు పరిష్కార మౌతుందో ఎవరూ చెప్పలేక పోతున్నారు.

పోలీసులు వేటకుక్కల వలె కాచుకుని వుండడమే బాలరాజు ప్రాణాలు కాపాడుతుంది. అతడ్ని చంపినా, వదిలేసినా మరుక్షణంలో అడవులపై పోలీసులు విరుచుక పడడం ఖాయం. ఇప్పటికే హైదరాబాదు సిటీలో పెద్ద ఎత్తున దాడులు జరుగుతున్నాయి. నంబర్ టు స్థానంలోని నాయకుడు నిమ్మలూరు భాస్కర్ కూడా పోలీసుకు చిక్కినట్లు నక్సలైట్లు అనుమానిస్తున్నారు. తాము బాలరాజుకు హాని తలపడితే, వారు జైల్లోని తమ నాయకులకు ముప్పు తెస్తారనే భయం ఏర్పడింది. అట్లని బాలరాజును ఎంత కాలమని భరిస్తారు? ఒక రకంగా అది కూడా నక్సలైట్లకు గిరిజనుల్లో వ్యతిరేకత తెచ్చే ప్రమాదం వుంది! కొరివితో తల గోక్కున్నట్లుగా వుంది వారి పరిస్థితి ఇప్పుడు.

### జయలలితతో జనార్దన రెడ్డి దౌత్యం

జయలలిత లోని మహిమ ఏమిటో గాని, ఆమె పేరు చెప్తేనే ప్రధాని పివి నరసింహారావుకు పీడకలలు వస్తున్నాయి. అదేమి మంకు పట్టుదలో - వయస్సులో పెద్దవాడు, సాక్షాత్తు ప్రధాన మంత్రి, స్వయంగా ఇంటికి వచ్చి, విందారగించి, సౌజన్యత్వం

6వ పేజీలో

ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్
సెక్స్ ఎడ్యుకేషన్ వాషింగ్‌టన్
(అమెరికా) నుండి, సెక్స్
సైన్సు పరిశోధనలో ఆ
సంస్థ ద్వారా మొట్టమొదటి
'ఫెలో' డిగ్రీని సాధించి,
దేశంలోని అతి తక్కువ
సంఖ్యలో నున్న

సె క్స్ . సె క్స్ . సె క్స్

సెక్సు స్పెషలిస్టుల లిస్టులో ఒకరుగా
గుర్తింపు పొందిన శుభ సందర్భాన

డా. జె.పి. రెడ్డిని

(చర్మ, సుఖవ్యాధి నిపుణులు, పొగతోట, నెల్లూరు)

అభినందిస్తూ.......

నియర్స్ అండ్ డియర్స్

# గూడూరు కాంగ్రెస్ గుర్రం మూడు కాళ్లమీద దౌడుతీస్తూంది

రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్ల మీద పరుగెడుతుందని సామెత; అటువంటి రౌతులు ఒకరికి ముగ్గురెక్కితే? - ఆ గుర్రం ముంగాళ్ళ మీద దౌగాడుతుంది; కాంగ్రెస్‌కు సంబంధించి గూడూరులో ఇప్పుడు జరిగేదదే!

జిల్లా రాజకీయాలలో గూడూరుది ఎప్పుడూ ఉలిపికట్టె వైఖరి! ఆనం వారి ప్రభ మసక బారినప్పటి నుంచి, పదిహేనేళ్లుగా జిల్లా రాజకీయ పెత్తనం గూడూరులోనే వుంది. ఇద్దరే ఇద్దరు నాయకులు పోటాపోటీలుగా, ఒకర్నొకరు వెనక్కు నెట్టుకుంటూ, ముందు మిగుల్తూ, వెనుకపడుతూ, తమ మధ్య మూడవ వాడు దూరబడకుండా జాగ్రత్తపడుతూ నెట్టుకొస్తున్నారు. ఆ ఇద్దరిలో ఒకాయన గూడురే కాదు, జిల్లా స్థాయి కూడా దాటి పోయారు; మరొకరు ఆరోగ్యం చెడి, దూరమై పోయారు. వారి స్థాయిలో కాకపోయినా, వారి స్థానంలో కాంగ్రెస్ పెత్తనానికి వచ్చిన యువ నాయకులు

## జిల్లా వార్తలు

మాత్రం జిల్లా నాయకత్వం సంగతి దేముడెరుగు, కనీసం పంచాయితీ వార్డు స్థాయిలోనూ నాయకులుగా ఎదగలేక పోతున్నారు. అదేమి దురదృష్టమో - రాజకీయ మంటే ధనార్జన అనే దౌర్భాగ్యపు సిద్ధాంతం, అభిప్రాయం గూడూరు యువ కాంగ్రెస్ నాయకులలో బలంగా పాతుక పోయాయి. వారి యావ ఎప్పుడూ దానికోసమే; వారి ప్రతిష్ఠలు, పంతాలు ఎప్పుడూ వాటిపైనే! ప్రజల్లో కలిసి పోయి పనిచేయడం, ప్రజల అభిమానం చూరగొనడానికి పోటీ పడడం వారికి తెలియదు. నాయకుల చుట్టూ తిరగడమే రాజకీయమనే సూత్రానికి విధేయులు వారు. అందులోనూ ఐక్యత లేదు. [illegible] రున్నారో అని గ్రూపులు; దీని వల్ల అసలు పార్టీ ఉనికికే భంగం కల్గుతుంది.

ఎల్లసిరి గోపాలరెడ్డి, కోడూరు శ్రీనివాసులు రెడ్డి, వరదలవాత వెంకటేశ్వర్లు మూడు ప్రధాన గ్రూపులకు

కొరవ 10 పేజీలో

# పడుగుపాడు రైల్వే స్టేషన్‌లో పక్కా ఇళ్లు

బీహార్‌లోనో, ఉత్తరప్రదేశ్‌లోనో ఒక మిడాసి రైల్వే స్టేషన్‌ను తన స్వంత ఆస్తిగా అమ్మి, రిజిష్టరు చేశాడని వింటుంటాం; అమ్మడం, కొనడం అనే ఇబ్బంది లేకుండా ఏకంగా రైల్వే స్టేషన్ ఆవరణంలోనే ఇళ్లు కట్టేసి కాపురాలు చేయడం ఇప్పుడు చూస్తున్నాం!

పడుగుపాడు రైల్వేస్టేషన్‌కు దక్షిణంగా, గూడ్సు బండ్లు ఆపి, సరకులు అన్‌లోడ్ చేసే ప్రదేశం వుంది. దానిలో కరతుమ్మ అడవి పెరిగి వుంది. స్థానికులైన కొందరు ఆ చెట్లను నరికి, స్థలాన్ని తమలో తాము పంచుకొని దర్జాగా ఇళ్లు కట్టేస్తున్నారు. మొదట శాంపిల్ కోసం పూరిళ్లు వేశారు; ఎవరూ అడ్డు చెప్పక పోయే సరికి, రాతి గోడలు పెట్టి, రేకుల కప్పుతో పక్కా ఇళ్లే కట్టేస్తున్నారు. స్థలం చదును చేసుకోవడానికి రైల్వే స్థలంలోనే గుంటలు పెట్టి మట్టి తీస్తున్నారు. ఈ గుంటల్లో నీళ్లు నిల్చి, రైల్వే ట్రాక్ క్రుంగిపోయే పరిస్థితి ఏర్పడుతున్నది.

ఇంత జరుగుతున్నా, రైల్వే అధికారులకు మాత్రం ఏమీ పట్టడం లేదు. వారు చూసీ చూడనట్లు పోతూండడంతో దురాక్రమణ దారులకు ధైర్యం పెరిగి పోతూంది. వెంకటేశ్వరపురం నుంచి పడుగుపాడు వరకు వున్న ఆక్రమణలు తీస్తే గదా - మా జోలికి వచ్చేది అంటారు వారు.

నెల్లూరు స్టేషన్‌లో గూడ్సు యార్డు చాలీ చాలనిది; కృష్ణపట్నం రేవు వంటివి వస్తే భవిష్యత్తులో అటు పడుగుపాడు, ఇటు వేదాయపాళెం స్టేషన్లే గూడ్సు బండ్ల అవసరాలు తీర్చాలి! వుంటే స్థలమంతా ఆక్రమణైపోతే అప్పుడు ఎక్కడకు పరుగులు పెడతారు? పక్కా ఇళ్లు కట్టిన తర్వాత పడగొట్టేకంటే కట్టకముందే నివారించడం మేలు కాదా? రైల్వే అధికారులు ఆలోచించాలి!

## ఆర్మీ సెలక్షన్

ఇండియన్ ఆర్మీలో చేరదలచిన అభ్యర్థుల ఎంపిక ఫిబ్రవరి 26 తేది నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్సులో జరుగుతుంది. శారీరక పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ఆ రోజే రాత పరీక్ష కూడా నిర్వహిస్తారు. ఎంపికకు హాజరయ్యే విద్యార్థులు ఎస్.ఎస్.సి. పాసై 16 నుండి 21 సంవత్సరాల వయస్సు కలిగి వుండాలి. కనీస ఎత్తు 162 సెం.మీ., బరువు 50 కేజీలు వుండాలి. ఔత్సాహిక యువకులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ కోరుతున్నారు.

## వ్యవసాయ పశు ప్రదర్శన

జిల్లాలోని రైతులను ప్రోత్సాహపరిచి వారి వారి రంగాల్లో అనూహ్య అభివృద్ధి సాధించను ప్రతి సంవత్సరం ఏర్పాటు చేసే వ్యవసాయ, పశు ప్రదర్శన ఈ సారి మార్చి 11 తేది నుండి 13 తేది వరకు నెల్లూరులో జరుగుతుంది. వై.ఎం.సి.ఎ. గ్రౌండ్‌లో ఏర్పాటయ్యే ఈ ప్రదర్శన వివిధ ప్రభుత్వ శాఖల అభివృద్ధికి సంబంధించిన 30 స్టాల్స్‌తో పాటు ప్రైవేటు వ్యక్తులు 20 స్టాల్స్ పెట్టుకొనేందుకు అనుమతి ఇవ్వనున్నారు. వ్యవసాయంలో అధునాతన పద్ధతులు, మెళకువలు, పశుపోషణ, అభివృద్ధి పై ఎన్నో విషయాలు ప్రదర్శన సందర్శించి తెలుసు కోవచ్చునంటున్నారు జిల్లా కలెక్టరు ఎం. సాంబశివ రావు.

National నిప్పో స్పెషల్

నిప్పో స్పెషల్ ఎప్పుడూ సరిక్రొత్తగా 'టాప్‌సీల్' తో నాణ్యతకి సంబంధించిన IS చిహ్నంతో వస్తుంది. టాప్‌సీల్ వున్న తొట్టమొదటి పేపర్ క్లాట్ బ్యాటరీ నిప్పో స్పెషల్. ప్రపంచ ప్రసిద్ధిచెందిన మ ట్సుషిట ఎలక్ట్రిక్– జపాన్ వారి (నేషనల్ పానసోనిక్ టెక్నిక్స్ ప్రొడక్ట్స తయారీ దారులు) సాంకేతిక విధానంతో తయారు చేయబడి, అత్యుత్తమంగా పనిచేస్తుంది. దీర్ఘకాలం మన్నుతుంది.




National నిప్పో

ప్రపంచ ప్రసిద్ధి చెందిన జపాన్‌లోని మట్సుషితా ఎలక్ట్రిక్ వారి సాంకేతిక విధానంతో తయారు చేయబడింది.

